తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 11 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 282 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# ప్రీ-బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క

- గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ
- మహిళలు, చిన్నారుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
- సమావేశంలో పాల్గొన్న మంత్రి సీతక్క

**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** రాబోయే రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించి పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖలపై ప్రీబడ్జెట్ సమీక్ష సమావేశాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నిర్వహించారు.

మిగతా 2లో..

# తెలంగాణ కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం

- హైదరాబాద్ చేరుకున్న శివ ప్రతాప్ శుక్లా
- విమానాశ్రయంలో ముఖ్యమంత్రి స్వాగతం
- మంత్రులు, ఉన్నతాధికారుల హాజరు



**హైదరాబాద్, 10 మార్చి (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రానికి నూతన గవర్నర్‌గా నియమితులైన శివ ప్రతాప్ శుక్లా హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతం పలికారు. రాష్ట్రానికి వచ్చిన నూతన గవర్నర్‌కు ఘనంగా స్వాగతం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కూడా గవర్నర్‌కు స్వాగతం తెలిపారు.

మిగతా 2లో..

## కళాశాలలకు ప్రభుత్వం షాక్..

# ట్యూషన్ ఫీజు తప్ప మరో ఫీజు వసూలు చేయరాదు

- ఇంజనీరింగ్, ఫార్మసీ, లా తదితర కోర్సుల ఫీజుల్లో మార్పులు
- స్పెషల్ ఫీజులు, అడ్మిషన్ ఫీజుల వసూళ్లకు అడ్డుకట్ట
- విద్యార్థులపై అదనపు భారం తగ్గించడమే లక్ష్యం



**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, లా, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల ఫీజులను ఇటీవల భారీగా తగ్గించిన ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ట్యూషన్ ఫీజు తప్ప అదనంగా ఇతర ఎలాంటి రుసుములు వసూలు చేయకూడదని కొత్త నిబంధనను తీసుకొచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన కొత్త ఫీజుల ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఇప్పటివరకు కళాశాలలు ట్యూషన్ ఫీజుతో పాటు ప్రత్యేక రుసుములు, అడ్మిషన్ ఫీజుల పేరుతో విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నాయి. గతంలో ట్యూషన్ ఫీజుతో పాటు రూ.8,500 వరకు ఇతర రుసుములను వసూలు చేసుకునే అవకాశం ఉండేది.

మిగతా 2లో..

# అవయవ మార్పిడి చికిత్సలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

ఆర్గాన్ డొనేషన్ విధానాల సరళీకరణపై చర్చ.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స ఖర్చులపై ఆగ్రహం

**సమగ్ర పాలసీ రూపకల్పనకు అధికారులకు ఆదేశం**

2లో



# గోదావరి పుష్కరాలపై మంత్రుల కీలక సమావేశం

- బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ సర్క్యూట్ ప్రణాళిక
- పుష్కరాల ఏర్పాట్లపై మంత్రుల విస్తృత చర్చ
- భక్తులకు మెరుగైన సదుపాయాలపై అధికారులకు ఆదేశాలు

2లో



# ప్రభుత్వంపై కవిత ఆగ్రహం

**నిరాహార దీక్ష నుంచి అర్ధరాత్రి అరెస్ట్‌పై మండిపాటు**

**పేదల ఇళ్ల కూల్చివేతపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**

**అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిక**

**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం గళమెత్తిన తనను ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేయడం అన్యాయమని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కూల్చివేసిన తీరును తీవ్రంగా తప్పుబట్టారు.

మిగతా 2లో..



# వరంగల్ అభివృద్ధిపై పొంగులేటి సమీక్ష

- నగర సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు
- త్వరలో ఎంజిఎం ఆస్పత్రి ప్రారంభం
- భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

2లో

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో 692 మంది డాక్టర్ల నియామకం

- సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు మెరిట్ జాబితా విడుదల
- 12 నుంచి అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన
- నెలాఖరుకల్లా విధుల్లో చేరనున్న వైద్యులు

**హైదరాబాద్, 10 మార్చి (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలను బలోపేతం చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెరిట్ జాబితాను విడుదల చేసినట్లు తెలంగాణ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు.
ఈ నెల 12 నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల ధృవీకరణ ప్రక్రియను ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. అర్హతలు పరిశీలించిన అనంతరం ఎంపికైన అభ్యర్థులను నియామక ప్రక్రియలోకి తీసుకుంటామని తెలిపారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత తగ్గి ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయని మంత్రి పేర్కొన్నారు.

మిగతా 2లో..



# డబ్బుల కోసం పసికందును అమ్మేసిన దంపతులు

- వారం రోజుల శిశువు విక్రయం
- అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి అప్రమత్తతతో బయటపడిన ఘటన
- రూ.1.7 లక్షలకు శిశువును విక్రయించినట్లు అంగీకారం

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అవయవ మార్పిడి చికిత్సలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష

**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలోని తన కార్యాలయంలో అవయవ మార్పిడి చికిత్సలపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ట్రాన్స్ ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ ఆక్ట్ విధాన రూపకల్పనతో పాటు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలుపై ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా అవయవ దానాలను ప్రోత్సహించేందుకు విధివిధానాలను సరళీకృతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి చికిత్సల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో అవయవ దాన చట్టం సమర్థవంతంగా అమలయ్యేలా సమగ్ర పాలసీ రూపకల్పనపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలపై విధిస్తున్న అధిక ధరలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యులు కూడా ఈ చికిత్సలను భరించే విధంగా ధరలను నియంత్రించాలని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. దాతలు ఇచ్చిన అవయవాలు వృథా కాకుండా ఆసుపత్రులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కూడా మంత్రి పేర్కొన్నారు. అలాగే విదేశాల నుంచి అవయవ మార్పిడి కోసం వచ్చే రోగుల కోసం కొత్త విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా మంత్రి తెలుసుకున్నారు. రాష్ట్రంలో చేతి మార్పిడి చికిత్సల కోసం ఇప్పటికే నాలుగు ఆసుపత్రులకు అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జెడ్ చొంగ్తు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ నరేంద్ర కుమార్, జీవన్ దాన్ డైరెక్టర్ శ్రీ భూషణ్ రాజ్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్, వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.



# గోదావరి పుష్కరాలపై మంత్రుల కీలక సమావేశం

**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు ప్రారంభించింది. డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన గోదావరి పుష్కరాల కేబినెట్ ఉపసమితి సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. గోదావరి పుష్కరాలను ఆధ్యాత్మిక వైభవంతో ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రధాన దేవాలయాలను ఒక టెంపుల్ సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా గోదావరి తీరం వెంట ఉన్న పురాతన ఆలయాలను అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని మంత్రులు సూచించారు. ఆలయాల అభివృద్ధితో పాటు పర్యాటక అవకాశాలు పెంచేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. బాసర ఆలయానికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ ఆమోదం లభించిన నేపథ్యంలో భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి కూడా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిపై చర్చించి ముఖ్యమంత్రి ఆమోదం పొందాలని నిర్ణయించారు. పుష్కరాల సమయంలో భారీగా వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్ల అభివృద్ధి, రహదారి సౌకర్యాలు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా వంటి మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రులు సూచించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి, హర్కర వేణుగోపాల్ మరియు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలను రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచేలా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు.

## కళాశాలలకు ప్రభుత్వం షాక్..

# ట్యూషన్ ఫీజు తప్ప మరో ఫీజు వసూలు చేయరాదు

(మొదటి పేజీ తరువాయి)

అయితే కొత్తగా జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ అదనపు ఫీజుల ప్రస్తావనను ప్రభుత్వం పూర్తిగా తొలగించింది.

ప్రత్యేక ఫీజుల పేరిట కళాశాలలు అనధికారికంగా ఎక్కువ మొత్తంలో వసూలు చేస్తున్నాయన్న ఆరోపణలు రావడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కొంతమంది కళాశాలలు అధికారికంగా రూ.8,500 వసూలు చేసే అవకాశం ఉన్నప్పటికీ అనధికారికంగా రూ.12,000 నుంచి రూ.16,000 వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఈ విధంగా ప్రతి ఏడాది బీటెక్ కోర్సుల నుంచే రూ.25 కోట్ల నుంచి రూ.35 కోట్ల వరకు అదనపు రుసుములు వసూలు చేస్తున్నారని అంచనా. ఇంజనీరింగ్‌తో పాటు ఇతర కోర్సులను కలిపి చూస్తే ఈ ప్రత్యేక ఫీజుల ద్వారా సుమారు రూ.100 కోట్ల వరకు వసూళ్లు జరుగుతున్నాయని తెలుస్తోంది. దీంతో విద్యార్థులపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించేందుకు ట్యూషన్ ఫీజు తప్ప ఇతర రుసుములను అనుమతించకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఇదిలా ఉండగా కళాశాల యాజమాన్యాలు మాత్రం కొన్ని రకాల ఫీజులను వసూలు చేసేందుకు అనుమతి ఉందని చెబుతున్నాయి. అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఇచ్చిన అనుమతులపై కూడా చర్చ జరుగుతోంది. ఈ అంశంపై తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ మరియు విద్యాశాఖ మధ్య స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# తెలంగాణ కొత్త గవర్నర్‌కు ఘన స్వాగతం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, రాష్ట్ర పోలీసు బి. శివధర్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు కూడా విమానాశ్రయంలో గవర్నర్‌ను ఆహ్వానించారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన గవర్నర్ రాష్ట్రానికి చేరుకోవడంతో రాజ్ భవన్‌లో అధికారిక కార్యక్రమాలు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. తెలంగాణకు కొత్త గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తి నెలకొంది. త్వరలో అధికారిక ప్రమాణ స్వీకారం జరిగే అవకాశం ఉందని సమాచారం.

# ప్రీ-బడ్జెట్ సమీక్ష సమావేశం నిర్వహించిన భట్టి విక్రమార్క

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా అమలవుతున్న పథకాలు, మహిళలు మరియు చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు భట్టి విక్రమార్క దిశానిర్దేశం చేశారు. రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, చిన్నారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి కీలకంగా మారాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రి దనసరి సీతక్క కూడా పాల్గొన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరై పథకాల అమలు పరిస్థితులను వివరించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

# 1 గ్యాస్ కొరతతో తెలుగు రాష్ట్రాల్లో హోటల్ రంగం ఆందోళన

**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల హోటల్ రంగంపై కూడా పడుతోంది. వాణిజ్య గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని హోటళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. కమర్షియల్ గ్యాస్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని పెట్రోలియం కంపెనీలు డీలర్లకు ఆదేశించడంతో హోటల్ యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో పలు హోటళ్లు తాత్కాలికంగా మూతపడిన నేపథ్యంలో ఇదే పరిస్థితి తెలుగు రాష్ట్రాల్లో కూడా ఏర్పడే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో తమ వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్‌లో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్యాస్ కొరత సమస్యకు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చూపకపోతే రాష్ట్రవ్యాప్తంగా హోటళ్ల బంద్‌కు దిగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఇదే పరిస్థితి ఆంధ్రప్రదేశ్‌లో కూడా కనిపిస్తోంది. విశాఖపట్నంలో వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉందని విశాఖ హోటల్ మర్చంట్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. సిలిండర్ల సరఫరా మరింత తగ్గే అవకాశముందని, ఇప్పటికే కొన్నిచోట్ల బ్లాక్ మార్కెట్ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్యాస్ కొరతపై విశాఖ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు హోటల్ వ్యాపారులు తెలిపారు. హోటల్ రంగం తీవ్ర సంక్షోభంలో పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకుని గ్యాస్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని వ్యాపారులు కోరుతున్నారు.



## ప్రభుత్వ ఆస్పత్రుల్లో 692 మంది డాక్టర్ల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వైద్య సేవలను బలోపేతం చేయడంలో ఈ నియామకాలు కీలకంగా ఉంటాయని తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తైన వెంటనే నియామక ప్రక్రియ పూర్తి చేసి ఈ నెలాఖరుకల్లా 692 మంది డాక్టర్లు విధుల్లో చేరనున్నట్లు మంత్రి దామోదర రాజనర్సింహ వెల్లడించారు. దీంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు మరింత మెరుగుపడనున్నాయి.

# ప్రభుత్వంపై కవిత ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

భూదాన్ భూములు అంటే పేదలకు ఇచ్చే భూములేనని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి చర్యలు చేపడుతోందని ఆమె విమర్శించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడే రాహుల్ గాంధీ ఈ ఘటనపై స్పందించాలని కవిత సూచించారు. ఖమ్మం జిల్లాలో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న పరిస్థితిని ఆయన గమనించాలని కోరారు. ఈ అంశంపై ఆయనకు లేఖ రాయనున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వ చర్యల వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. బాధితుల్లో ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా ఉన్నారని కవిత తెలిపారు. పరీక్షల సమయంలో వారిని రోడ్డున పడేయడం కలెక్టర్, జిల్లా మంత్రులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఈ పోరాటం ఇంతటితో ఆగదని, అవసరమైతే కోర్టులో పిల్ దాఖలు చేసి న్యాయపోరాటం కూడా కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు.

## డబ్బుల కోసం పసికందును

# అమ్మేసిన దంపతులు

**మెదక్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు) :** మెదక్ జిల్లాలో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. డబ్బుల కోసం కన్నపేగు బంధాన్ని కాసులకు అమ్ముకున్న ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. పుట్టిన వారం రోజులకే తమ మగబిడ్డను విక్రయించి మానవత్వానికే మచ్చ తెచ్చిన ఘటన హవేలీఘనాపూర్ మండలం లింగసానిపల్లి తండాలో జరిగింది. ఈ సంఘటన బయటపడటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల ప్రకారం, లింగసానిపల్లి తండాకు చెందిన ఓ గిరిజన దంపతులకు గత నెల 10వ తేదీన మగబిడ్డ జన్మించాడు. అయితే ఆర్థిక ఇబ్బందులను కారణంగా చూపుతూ పుట్టిన వారం రోజులకే ఆ పసికందును కామారెడ్డి జిల్లాకు చెందిన ఓ దంపతులకు విక్రయించినట్లు తెలిసింది. ఈ ఘటన అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలి అప్రమత్తతతో వెలుగులోకి వచ్చింది. బిడ్డ పుట్టిన తర్వాత తల్లి అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు, ఇతర పోషకాహారం తీసుకోవడానికి రాకపోవడంతో ఉపాధ్యాయురాలికి అనుమానం కలిగింది. దీంతో ఆమె వారి ఇంటికి వెళ్లి చూడగా తలుపులకు తాళం వేసి ఉండటం గమనించారు. వెంటనే ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించడంతో వారు రంగంలోకి దిగారు. దర్యాప్తులో ఆ గిరిజన దంపతులు మరో గ్రామంలో ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టుకుని బిడ్డ గురించి ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. తమ మగబిడ్డను రూ.1.7 లక్షలకు కామారెడ్డి జిల్లాకు చెందిన దంపతులకు అమ్మేసినట్లు వారు ఒప్పుకున్నారు. దీంతో ఐసీడీఎస్ అధికారులు వారిని హవేలీఘనాపూర్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వరంగల్ అభివృద్ధిపై పొంగులేటి సమీక్ష



**హైదరాబాద్, 10 మార్చి (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం సచివాలయంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ జిల్లా అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ నగరాన్ని హైదరాబాద్‌కు ధీటుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జూన్ 2 నాటికి పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులతో పాటు భద్రకాళి చెరువు డీసిల్టింగ్ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను పూర్తి చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రికి అవసరమైన సామగ్రి ఏర్పాటు, వైద్యులు మరియు సిబ్బంది నియామక ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని తెలిపారు. అదేవిధంగా ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్ పనులు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వరంగల్ పట్టణంలో రూ.5,257 కోట్లతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పనులకు త్వరగా టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వచ్చే నెలలో పనులు ప్రారంభించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న రెండు బెడ్‌రూమ్ ఇండ్లకు ఈ నెల 31లోగా లబ్ధిదారులను ఎంపిక చేసి కేటాయించాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, నాయిని రాజేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ మరియు హన్మకొండ జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.



# పేదప్రజల పక్షపాతి పంది నారాయణ

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు

**ఖమ్మం బ్యూరో, మార్చి 10(తెలంగాణ ముచ్చట్లు):** పేదప్రజల హక్కుల కోసం పోరాడిన పంది నారాయణ చిరస్మరణీయుడని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామంలో మంగళవారం కామ్రేడ్ పంది నారాయణ 38వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవీంద్ర బాబు మాట్లాడుతూ ఆనాటి భూస్వామ్య గుండాల చేతిలో హతమైన అమర జీవి నారాయణ తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో కమ్యునిస్టుగా మారి గ్రామంలో కూలి రేట్ల పెంపు కోసం, అనేక భూపోరాటాలు నిర్వహించి జైలు జీవితం గడిపారన్నారు. పేద ప్రజలకు భూపంపిణీ, ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాటాలను నిర్వహించిన నారాయణను భూస్వామ్య గూండాలు దారుణంగా హత్యచేసారన్నారు. ఆయన మరణం నాగిలిగొండ పరిసర గ్రామల్లో ఒక చైతన్యాన్ని తీసుకువచ్చిందన్నారు. పేద ప్రజల పక్షాన నిలబడి చేసే పోరాటాలే నారాయణ కు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు నాయకులు పదిమల వెంకటనర్సయ్య, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్, బాబు, పంది నాగేశ్వరరావు, శేఖర్, అరికోట్ల భాస్కర్, సుధాకర్, షైక్, చిన్న జానీ, షేక్ హుస్సేన్, ఫిలిఫ్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

- సీసీ రోడ్డు, నాలా అభివృద్ధి, బండచెరువు శుభ్రతపై వినతిపత్రం

**మల్కాజ్‌గిరి, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి, ఐఏఎస్‌ను మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు సంబంధించి వినతిపత్రాన్ని కమిషనర్‌కు అందించారు. సంతోష్ మాత గుడి నుండి నల్ల పోచమ్మ గుడి వరకు ఉన్న దీనదయాళ్ నగర్ రహదారిపై రూ.134 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన నంబర్‌తో కూడిన వినతిపత్రాన్ని సమర్పించినట్లు తెలిపారు.ఈ ప్రతిపాదనను గతంలో జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, ఐఏఎస్ ఆమోదించినట్లు ఆమె పేర్కొన్నారు. అలాగే సూర్యనగర్ నాలాను ఎస్ఎన్‌డీపీ పథకం క్రింద అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. బండచెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించి దోమల బెడదను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని, అక్కడ సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గడప నర్సింగ్ రావు, మంగేష్ కుమార్, ఓం ప్రకాష్ పాల్గొన్నారు. తమ ప్రతిపాదనలకు మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి తెలిపారు.



# మాదక ద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సు

**హసన్ పర్తి,మార్చ్ 10(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం,మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై హసన్ పర్తి, వంగపహాడ్,మల్లారెడ్డిపల్లి,నాగారం గ్రామలలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం హసన్ పర్తి సీఐ చేరాలు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఖాజిపేట ఏసీపీ పి.ప్రశాంత్ రెడ్డి,ఈగల్ ఫోర్స్ తెలంగాణ టీమ్ ఏసిపి నర్సింగరావు హాజరై మాట్లాడారు గుడుంబా,బెల్లం, గంజాయి,డ్రగ్స్ వినియోగించడం వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నట్లు తెలిపారు.ఇలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు.చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలని సూచించారు.ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా,సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలన్నారు. డ్రగ్స్ అనే మహమ్మరీ




యువత భవిష్యత్తులో నాశనం చేస్తుందని హెచ్చరించారు.గంజాయి విక్రయం, వినియోగంపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.గ్రామంలో ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయాలని పిలుపునిచ్చారు.వంగపహాడ్ గ్రామంలోని ప్రధాన కూడలిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.ఇట్టి కార్యక్రమానికి నిర్వహించినందుకు స్థానిక ప్రజలు పోలీస్ అధికారులకు సన్మానించారు.ఈ కార్యక్రమంలో హసన్ పర్తి సిఐ చేరాలు, ఎస్సై రవి, దేవేందర్ లు రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఎక్సైస్ సిబ్బంది, మెడికల్ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాల సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే మానవాళి మనుగడ

- కాప్రా చెరువును సందర్శించిన మల్కాజిగిరి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి
- పలు సూచనలు చేసిన ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా

**కాప్రా, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**






ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చెరువుల పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని మంగళవారం కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా చెరువు వద్ద నిర్వహించారు. చెరువు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించే కార్యక్రమాన్ని మల్కాజిగిరి జిహెచ్ఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శ్రీనిధి ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థులు, పారిశుద్ధ్య సిబ్బంది, ఎంటమాలజీ విభాగం సిబ్బంది పాల్గొన్నారు. మొత్తం సుమారు 125 మంది ఈ పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని చెరువు పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ చెరువులు సహా నీటి వనరులను పరిరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. చెరువుల పరిశుభ్రతతో ఆరోగ్యకరమైన జీవన విధానం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమాలకు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, డీఈ (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) రవి, సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, ఎంటమాలజీ ఏఈ డి.రమేష్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, యూబీడీ విభాగం సిబ్బంది, లేక్ ప్రొటెక్షన్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రిబాయి ఫూలే 129వ వర్ధంతి సభ

- మహిళా విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయం – వక్తలు

**కాప్రా, మార్చి 10 ( తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం కమలానగర్ కార్యాలయంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా స్ఫూర్తి గ్రూప్ నాయకురాలు అనురాధ, సామాజిక ఉద్యమ నేత పి. సత్యం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం అనురాధ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే దేశంలో తొలి మహిళా గురువుగా నిలిచి మహిళా విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారని తెలిపారు.సమాజంలో మహిళలు చదువుకుంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమని నమ్మి అనేక అడ్డంకులను ఎదుర్కొంటూ బాలికల కోసం పాఠశాలలను ప్రారంభించారని గుర్తు చేశారు. ఆమె ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరిస్తూ మహిళా సాధికారత కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. సామాజిక ఉద్యమ నేత పి. సత్యం మాట్లాడుతూ మహిళల విద్య, సమానత్వం కోసం సావిత్రిబాయి పూలే చేసిన కృషి అపారమని అన్నారు. సమాజంలో ఉన్న కులవివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి మహిళలకు విద్యా హక్కు కల్పించేందుకు పాఠశాలలను స్థాపించారని తెలిపారు. సమానత్వం, లౌకికతత్వం, రాజ్యాంగ విలువలను కాపాడే విధానాలు అమలు చేయాలని ఆయన కోరారు.అనంతరం శ్రీమన్నారాయణ మాటాడుతూ దేశంలో సామాజిక పరిణతికి కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక ఉద్యమ నేత, చరిత్రకారుడు కే.ఎన్. ఫణిక్కర్ మరణించడం విచారకరమని పేర్కొన్నారు. అలాగే పేదల పక్షాన పోరాటం చేసిన గంగ దేవరపల్లి రాజమౌళి మరణానికి సంతాప సూచకంగా కొద్దిసేపు మౌనం పాటించారు.అనంతరం సభ్యులందరూ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం లో శ్రీమన్నారాయణ, సోమయ్య, రుక్కయ్య, సామాజిక కార్యకర్త కోమటి రవి, ఎం. భాస్కర్ రావు, లక్ష్మయ్య, శశాంక్, జయరాజు, సిఐటియు నాయకులు రాజశేఖర్, గణేష్, ఉన్నికృష్ణ, ఎన్. శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, లింగస్వామి, నరేష్, మహిళలు శారదా, శోభ, గౌసియా తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ భగాయత్ అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు మంజూరు

- కమ్యూనిటీ హాల్, 10 కిలోమీటర్ల బ్లాక్‌టాప్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం
- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి ఫలితం

**ఉప్పల్, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ భగాయత్ ప్రాంత అభివృద్ధికి రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కృషి, సహకారంతో ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పలుమార్లు సమర్పించిన వినతిపత్రాలను పరిశీలించిన హెచ్ఎండిఏ అధికారులు ఈ నిధులను వివిధ అభివృద్ధి పనుల కోసం ఆమోదించినట్లు తెలిపారు.ఈ నిధులలో భాగంగా రూ.3 కోట్ల 40 లక్షల వ్యయంతో ఆధునిక సదుపాయాలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. అలాగే రూ.9 కోట్ల 60 లక్షలతో సుమారు 10 కిలోమీటర్ల మేర బ్లాక్‌టాప్ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి కాలనీలో రహదారి సౌకర్యాలను మెరుగుపరచనున్నారు.హెచ్ఎండిఏ లేఔట్ పరిధిలోని రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో అసోసియేషన్ సభ్యుల విజ్ఞప్తి మేరకు 42 మంది పారిశుద్ధ్య కార్మికులను ప్రత్యేకంగా కేటాయించినట్లు అధికారులు తెలిపారు. దీంతో కాలనీలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడనున్నాయి.అదేవిధంగా లేఔట్‌లో రైతు బజార్ కోసం కేటాయించిన స్థలంలో కూరగాయల వ్యాపారం సక్రమంగా జరిగేలా అభివృద్ధి పనులు చేపట్టాలని, అలాగే సుమారు 8 ఎకరాల పార్కు స్థలానికి చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు, స్ట్రీట్ లైట్లు, పెద్దలు మరియు పిల్లలకు ఆటవిడుపు కోసం అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను కోరారు.ఇక వెస్ట్ సైడ్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థ, మంచినీటి సరఫరా వంటి పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ఆయన సంబంధిత అధికారులతో చర్చించి వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ఉప్పల్ భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# హెచ్ఎంటి నగర్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- సుమారు 70 మంది మహిళలకు సన్మానం
- మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

**నాచారం, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హెచ్ఎంటి నగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ కాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కాలనీలోని సుమారు 70 మంది మహిళలను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మహిళల సేవలను గుర్తిస్తూ వారికి జ్ఞాపికలు, బహుమతులను మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, ప్రతి రంగంలోనూ మహిళలు ముందుకు వచ్చి విశేష విజయాలు సాధిస్తున్నారని అన్నారు.మహిళలకు సమాజంలో మరింత గౌరవం, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో ముఖ్య అతిథులు, కాలనీ మహిళలు మరియు స్థానికులు పాల్గొన్నారు .ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు రావూఫ్ సార్, శ్రీనివాస్, మధు, స్వామి రాజు, వెలన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




# సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు

- చెన్నై నోవహమో టెక్నాలజీస్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్.
- 66 మందిలో 17 మంది విద్యార్థుల ఎంపిక.
- సంవత్సరానికి రూ.3.4 లక్షల వేతనంతో నియామకం.

**సత్తుపల్లి, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**




స్థానిక మండల పరిధిలోని బి గంగారం గ్రామం సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మరోసారి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ప్రతిభ చాటారు. చెన్నైకు చెందిన నోవహమో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో కళాశాల నుంచి మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొనగా, కంపెనీ నిర్వహించిన ఆన్‌లైన్ రాత పరీక్ష, టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్, మౌఖిక ఇంటర్వ్యూ ద్వారా 17 మందిని ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎంపికైన వారిలో సీఎస్ఈ నుంచి 6 మంది, సీఎస్ఎం నుంచి 5 మంది, ఏఐ & డీఎస్ నుంచి 4 మంది, ఈసీఈ నుంచి 2 మంది ఉన్నారు. ఎంపికైన విద్యార్థులు ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం పూర్తి అయిన వెంటనే చెన్నైలోని సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా విధుల్లో చేరనున్నారు. వీరికి సంవత్సరానికి రూ.3.4 లక్షల వేతనం అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ట్రస్టీ శ్రీమతి బండి అన్విద వర్చువల్‌గా విద్యార్థులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో సబ్జెక్టు పరిజ్ఞానం మాత్రమే కాకుండా సాంకేతిక నైపుణ్యాలు కూడా అవసరమని చెప్పారు. విద్యార్థులు కళాశాలలో చదువుతున్నప్పుడే కొత్త నైపుణ్యాలను అభ్యసిస్తూ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ డి.వి. కృష్ణారెడ్డి, వివిధ విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జ్‌లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కోమట్లగూడెంలో మనుశ్రీ కి రూ.10,016 పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్‌డ్ డిపాజిట్

◆ కీ.శే లు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి యూత్ ఆధ్వర్యంలో

**ఖమ్మం బ్యూరో, మార్చి10(తెలంగాణ ముచ్చట్లు)**

ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్ల గూడెం గ్రామంలో శ్రీ అంకమ్మ తల్లి జాతర సందర్భంగా నిర్వహించిన డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు తమ ప్రతిభను ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు.ఈ సందర్భంగా అమర జీవిమాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సేవలను స్మరించుకుంటూ కోమట్లగూడెం వైయస్సార్ యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా కన్సొలేషన్ బహుమతి ఇవ్వడం జరిగింది. కనతాల రాంబాబు - సరిత దంపతుల కుమార్తె మను శ్రీ కు రూ.10,016 కన్సొలేషన్ బహుమతిగా అందజేశారుఅం తేకాకుండా చిన్నారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆ మొత్తం మొత్తాన్ని ఈరోజు గ్రామంలోని పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరిగింది. చిన్నారి విద్యాభివృద్ధికి ఉపయోగపడేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైయస్సార్ యూత్ సభ్యులు తెలిపారు. ఈ



సందర్భంగా మను శ్రీ తల్లిదండ్రులు వైఎస్ఆర్ యూత్ కు కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన గ్రామ పెద్దలు, యువకులు,నిర్వాహకులు మరియు గ్రామ ప్రజలందరికీ వైయస్సార్ యూత్ తరపున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమం సామాజిక సేవకు, చిన్నారుల ప్రోత్సాహానికి మంచి ఉదాహరణగా నిలిచింది భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని నేటి బాలలే రేపటి పౌరులుగా కీర్తించబడాలంటే స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలని గ్రామ పెద్దలు ప్రజలు యువతి యువకులు కోరారు



## ఈవిఎం గోడౌన్ ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో, మార్చి -10(తెలంగాణ ముచ్చట్లు):** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. ముందుగా ఈవిఎం గోడౌన్ సీల్ ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి, ఈ.వి.ఎం., వి.వి. ప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అలారం, ఫైర్ సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఎన్నికల సామాగ్రి భద్రత అత్యంత ముఖ్యమని, సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఏ ఇ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, బహుజన్ సమాజ్ పార్టీ ప్రతినిధి ఎం. కిషోర్, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సిపిఐ (ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణప్రసాద్, అధికారులు, తదితరులు ఉన్నారు.




## అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించిన టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం డిపో

**ఖమ్మం బ్యూరో, మార్చి 10(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఖమ్మం డిపోలో అవుట్ సోర్సింగ్ డ్రైవర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా డ్రైవర్లకు ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించే విధానం, ట్రాఫిక్ నిబంధనలు పాటించే అవసరం, మద్యం సేవించి వాహనం నడపడం తీవ్రమైన నేరమని అవగాహన కల్పించారు. అలాగే డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ ఉపయోగించడం ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. ప్రయాణికులు కోరిన చోట ఎక్కించుకోవడం, దింపడం ద్వారా సంస్థకు మంచి పేరు తీసుకురావాలని, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ గౌతమి, డిపో ఎంఎఫ్ ప్రవీణ్, డి ఐ అంజయ్య, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అడిషనల్ డీసీపీ (అడ్మిన్)ను కలిసిన ఎంపీజే బృందం

**ఖమ్మం బ్యూరో, మార్చి 09(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం నగర పోలీస్ కమిషనరేట్‌లో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) బి. రామానుజం ను ఎంపీజే (ఎంపీజే) ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జేఐహెచ్ ప్రధాన కార్యాలయంలో, మార్చి 11న నిర్వహించనున్న ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని ఎంపీజే బృందం ఆహ్వానించింది. దీనిపై డీసీపీ (అడ్మిన్ ) బి. రామానుజం సానుకూలంగా స్పందించారు.

ఈ సందర్భంగా ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల గురించి డీసీపీకి వివరించారు. అనంతరం ఎంపీజే బృందం తరపున ఎంపీజే పరిచయ పుస్తకాన్ని డీసీపీ రామానుజంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం, జిల్లా కోశాధికారి ఎండి హకీమ్, సభ్యుడు అర్షీన్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ ఉత్పతుల కొనుగోళ్లలో ప్రైవేట్ ఏజెన్సీల పాత్ర ఏంటి..?

◆ పారదర్శకతకు కేంద్రం తీసుకుంటున్న చర్యలు తెలపండి
◆ రైతుల ప్రయోజనాలు కాంక్షిస్తూ లోక్ సభలో వివరాలు కోరిన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, మార్చి 10(తెలంగాణ ముచ్చట్లు)**

వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లలో ప్రైవేట్ ఏజెన్సీల పాత్ర, వాటి ఎంపిక ప్రమాణాలు, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్‌సభలో కోరారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా ప్రైవేట్ కొనుగోళ్లు మరియు ప్రభుత్వ మద్దతు పథకాల మధ్య సమతుల్యత



ఎలా కొనసాగిస్తున్నారో వెల్లడించాలని ప్రశ్నించారు. పార్లమెంట్ మలి విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. దీనికి కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖల సహాయ మంత్రి భగీరథ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

**పీఎం—ఆశా ద్వారా మద్దతు ధర**

ప్రధాన మంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ అభియాన్ (పీఎం-ఆశా)లోని పీఎస్ఎస్ కింద పప్పుధాన్యాలు, నూనె గింజల కొనుగోళ్లు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర నోడల్ ఏజెన్సీలుగా నాఫెడ్, నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ సంస్థలు వ్యవహరిస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు నియమించిన రాష్ట్ర స్థాయి ఏజెన్సీలు, సహకార మార్కెటింగ్ సమాఖ్యలు కొనుగోళ్లను నిర్వహిస్తున్నాయని వివరించారు.

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటు**

రైతులకు సౌలభ్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు తాత్కాలిక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రైతుల ఉత్పత్తి, మార్కెటింగ్ అవసరాలు, నిల్వ మరియు రవాణా సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

**రైతుల ఖాతాల్లోకే చెల్లింపులు..**

కొనుగోలు చేసిన పంటకు సంబంధించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)ను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో డీబీటీ ద్వారా జమ చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రైతులకు కొనుగోళ్లు నిర్వహించే తేదీలు, కేంద్రాల వివరాలు, నాణ్యత ప్రమాణాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

# పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

◆ జిల్లా కలెక్టర్ అంకిత్

**ఖమ్మం బ్యూరో, మార్చి 10(తెలంగాణ ముచ్చట్లు)**

మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతికి ఎంతో కీలకమైన పరీక్షలు కావడంతో నిర్వహణలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు విద్యా





ర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 73 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 12,731 మంది రెగ్యులర్ విద్యార్థులు, 404 మంది ప్రైవేట్ అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించబడతాయని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, కూర్చోవడానికి తగిన ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రత విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాలని సంబంధిత అధికారులకు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బి సెక్షన్ అమలు, జిరాక్స్ కేంద్రాలపై నియంత్రణ వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాల విషయంలో అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, డి పి ఓ సుధీర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లింగ వివక్షకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలి

◆ సిఐటియు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ
◆ ఎస్.వి.రమ పిలుపు

**ఏ ఎస్ రావు నగర్, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

లింగ వివక్షను, మహిళలపై జరుగుతున్న దాడులను సమాజం మొత్తం కలిసి ప్రతిఘటించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్.వి. రమ పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా సిఐటియు కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కమలానగర్‌లోని సిఐటియు కార్యాలయం భాస్కర్ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి ఎం. వినోద, జిల్లా శ్రామిక మహిళ కన్వీనర్ ఎం. రేవతి కళ్యాణి అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఎస్.వి. రమ మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం మహిళల సుదీర్ఘ పోరాటాల ఫలితమని తెలిపారు. 1901లో కోపెన్‌హేగన్‌లో జరిగిన సోషలిస్ట్ మహిళల సదస్సులో క్లారా జెట్కిన్ ప్రతిపాదనతో మహిళా దినోత్సవం ప్రారంభమైందన్నారు. న్యూయార్క్ గార్మెంట్ కార్మికుల పోరాటాలు, మహిళా కార్మికుల భారీ ప్రదర్శనలు మహిళా ఉద్యమాలకు నాంది పలికాయని







చెప్పారు. అయితే నేడు పాలకులు, కార్పొరేట్ సంస్థలు మార్చి 8ను వ్యాపార ప్రకటనలు, వస్తువుల అమ్మకాలకే పరిమితం చేస్తూ మహిళా ఉద్యమాల స్ఫూర్తిని నీరుగారుస్తున్నాయని విమర్శించారు.కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని, మహిళలకు సమాన హక్కులు, సమాన పనికి సమాన వేతనం కల్పించడంలో విఫలమైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మహిళలు, పిల్లలపై హింసలు పెరుగుతున్నప్పటికీ నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రామిక మహిళలు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయడం అన్యాయమని అన్నారు.ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్. అరుణజ్యోతి మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడం వల్ల గ్రామీణ మహిళల జీవనోపాధిపై ప్రభావం పడుతోందన్నారు. మహిళలపై అత్యాచారాలు, యాసిడ్ దాడులు, హత్యలు పెరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో పాలకులు విఫలమవుతున్నారని విమర్శించారు. మహిళా సాధికారత పేరుతో గొప్పలు చెప్పే ప్రభుత్వం వాస్తవంలో పురుషాధిపత్యానికే ప్రోత్సాహం ఇస్తోందన్నారు.శ్రామిక మహిళ మేడ్చల్ జిల్లా కన్వీనర్ ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు మహిళలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, సమాన పనికి సమాన వేతనం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్ర అశోక్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం (2013) అమలులో లోపాలున్నాయని అన్నారు. అన్ని కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేసి చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె. ఉన్నికృష్ణన్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు జి. సునీత, బి. శోభారాణి, ఆశ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు డి. అనిత, నాయకులు కవిత, జెవివి జిల్లా కోశాధికారి జెన్నీ, ధరణి దినపత్రిక ఎడిటర్ రోజారాణి, స్ఫూర్తి నాయకురాలు పద్మావతి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎ. సృజన తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరిలో ఆకస్మిక తనిఖీలు

◆ పారిశుధ్యంపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కఠిన ఆదేశాలు

**మల్కాజ్‌గిరి, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపర్చేందుకు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఐఏఎస్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలవుతున్న 99 రోజుల కార్యాచరణలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.ఆనంద్‌బాగ్ చౌరస్తా వద్ద స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్లతో సమావేశమైన కమిషనర్ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలని సూచించారు. ఒక ప్రాంతంలో బహిరంగంగా చెత్త కనిపిస్తే సంబంధిత స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్ల పనితీరు సరిగా లేదని భావిస్తామని హెచ్చరించారు.కిరాయిదారులు రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి యజమానులు అవగాహన కల్పించాలని సూచించారు.కిరాయిదారులు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే ఇంటి యజమానులపై జరిమానా విధిస్తామని తెలిపారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వారికి చెత్త నిర్వహణపై అవగాహన లేకపోవడం వల్ల నగరంలో అపరిశుభ్రత పెరుగుతోందని పేర్కొన్నారు.స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్లు






ఇంటింటికి వెళ్లి నిరుపయోగ వస్తువులను కూడా సేకరించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల సహకారంతో చెత్త సేకరణ చేపట్టాలని తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా చేసే ఫిర్యాదులను గంటలోపే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఏలకు ఆదేశించారు.మల్కాజ్‌గిరి-మౌలాలీ ప్రాంతాల్లో రోడ్లపై ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయని, వాటిని నిర్ణీత ప్రదేశాల్లో భద్రపరచాలని అధికారులకు సూచించారు. అలాగే గ్రీన్ వేస్ట్ తొలగించేందుకు ప్రతి సర్కిల్‌కు ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఏసీ శానిటేషన్ రఘుప్రసాద్, డీఈఈ మహేశ్వర్ (సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్), సూపర్వైజర్ చింత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## కాప్రా మండలంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమం

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహణ
- మహిళా విద్యకు ఆమె చేసిన సేవలను స్మరించుకున్న నాయకులు

**కాప్రా, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కాప్రా మండలంలోని రాధికా ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది విద్యార్థినులు మరియు సభ్యులు పాల్గొన్నారు.కార్యక్రమానికి కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ రావు అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి శ్రీమన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మెడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తిక్ ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలను వివరించారు. కుల వివక్ష, సామాజిక అన్యాయాలను ఎదుర్కొంటూ కూడా బాలికల విద్య కోసం ఆమె ధైర్యంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వం, విద్య హక్కుల కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు అతిథులు, విద్యార్థులు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## డ్రగ్స్ నియంత్రణపై వేలేరు పోలీసుల అవగాహన సమావేశాలు

**వేలేరు, మార్చ్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కమ్మరిపేట, మల్లికుదుర్ల, షోడశపల్లి, వేలేరు గ్రామాల్లో డ్రగ్స్ నియంత్రణపై విస్తృత అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐ ఎ. పూర్ణేశ్వర్ అధ్యక్షత వహించారు. TGNAB ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌లు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ పూర్ణేశ్వర్ మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరించారు. డ్రగ్స్ విక్రయం మరియు వినియోగంపై పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువు, క్రీడలు మరియు మంచి లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సమస్యను అరికట్టడం మరియు యువతలో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా వేలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు వేలేరు ఎస్సై సురేష్ తెలిపారు.




## ప్రభుత్వ ఆసుపత్రిలో స్కానింగ్ ప్రింట్ లేక గర్భిణీల ఇబ్బందులు

**కుషాయిగూడ, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, స్కానింగ్ అనంతరం బిడ్డకు సంబంధించిన ఫోటో లేదా వివరాలు ఉండే పేపర్ ప్రింట్ ఇవ్వకపోవడం గర్భిణీలకు ఇబ్బందిగా మారింది. సాధారణంగా స్కానింగ్ చేసిన తర్వాత బిడ్డ పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు ప్రింట్ ఇవ్వాల్సి ఉండగా, ఇక్కడ ఆ సౌకర్యం లేకపోవడంతో గర్భిణీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్కానింగ్ రిపోర్టు ప్రింట్ లేకపోవడంతో గర్భిణీలు తమ వైద్య రికార్డులను పూర్తి స్థాయిలో పొందలేక ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు.దీంతో కొంతమంది గర్భిణీలు ప్రైవేట్ స్కాన్ సెంటర్లకు వెళ్లి ప్రింట్లు తీసుకోవాల్సి వస్తోందని, దాంతో అదనపు ఖర్చు పడుతోందని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాల్సి ఉండగా ఈ సమస్య నెలకొనడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.స్కానింగ్ యంత్రానికి సంబంధించిన ప్రింటర్ లేదా పేపర్ సౌకర్యాన్ని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని గర్భిణీలు, స్థానికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను త్వరగా పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మరకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- డిసిపి దార కవిత



**కాజీపేట్ మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు)** నేడు యువత మత్తు పదార్థాల బారినపడి తమ విలువైన జీవితాలను కోల్పోతున్నారని వాటిని నివారించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత అన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన ప్రగతి నివేదన 99 రోజుల సదస్సులో భాగంగా మంగళవారం మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నివారణ కోసం మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అన్ని ప్రభుత్వ విభాగాలైన పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, విద్య, ఆరోగ్య, మహిళా విభాగం లతోపాటు ఇతరత్రా ప్రభుత్వ కార్యాలయాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మడికొండలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీపీ కవిత హాజరై మాట్లాడుతూ ప్రజలు మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండాలని మన కోరారు డ్రగ్స్ నివారణ కోసం పోలీస్ డిపార్ట్మెంట్ అవిశ్రాంతంగా కృషి చేస్తుందని ఆమె తెలిపారు. అందులో భాగంగా టీజీనాబ్, ఈగల్ టీం, వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరపున డ్రగ్స్ కంట్రోల్ టైం ఏర్పాటు చేసి గంజాయి ఇతర మత్తు పదార్థాలను మూలించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు ఇతర ప్రభుత్వ విభాగాల నుండి వచ్చిన అధికారులు కూడా డ్రగ్స్ నివారణ కోసం చాలా విలువైన సూచనలు చేశారు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మడికొండ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

**కాజీపేటలో...**

కాజీపేట లోని సోమిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మరకద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకున్న 99 రోజుల ప్రోగ్రాం లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నియంత్రణపై జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. సందర్భంగా జక్కుల రవీందర్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తు దృశ్య మాదకద్రవ్యాల నిర్మూలనకు పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులు లతో కలిసి పని చేయాలని ఆయన కోరారు. విద్యార్థులు డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఖాళీ సమయాలలో విద్యార్థులు క్రీడలకు కేటాయిస్తూ కోకో, వాలీబాల్, బ్యాట్మెంటన్ వంటి క్రీడలు ఆడితే శరీరకంగా తోపాటు మానసిక ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని ఈ సమయంలో సరైన మార్గంలో నడిస్తే వారి భవిష్యత్తు బంగారు మాయమవుతుందని ఆయన పేర్కొన్నారు. చెడు అలవాట్ల గురి కాకుండా మంచి లక్షలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఇన్స్పెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ బారినపడి యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అలాంటి సామాజిక రుగ్మతని అందరం కలిసి సమాజాన్ని విలువేయాలని ఆయన పిలుపునిచ్చారు. మరకద్రవ్యాల వ్యసనం వ్యక్తి ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి కుటుంబంతో పాటు సమాజాన్ని దెబ్బతీస్తుందని ఆయన తెలిపారు. మారకద్రవ్యాల నియంత్రణకై తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని వాటి వాడకం రవాణాలపై ఎలాంటి సమాచారం ఉన్న తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు వెంకటరమణ, నవీన్ కుమార్ పోలీస్ సిబ్బందితోపాటు పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఈసారైనా దళితులకు అవకాశం దక్కుతుందా?

**పెద్దమందడి,మార్చి10(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల అధ్యక్ష పదవికి ఆశావాహుల నుండి వినతులు స్వీకరించారు.ఈ కార్యక్రమం ఎమ్మెల్యే మేఘా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.మండల అధ్యక్ష పదవిని ఆశిస్తున్న పలువురు నాయకులు తమ వినతిపత్రాలను సమర్పించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఈసారి మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో దళితులకు అవకాశం కల్పించాలనే అభిప్రాయం కార్యకర్తలలో వినిపిస్తోంది. ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేస్తున్న దళిత సీనియర్ నాయకులు మండలంలో చాలామంది ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.రాజకీయాల్లో ఎక్కడ చూసినా బీసీ నినాదం వినిపిస్తున్నప్పటికీ, మరోవైపు అగ్రవర్ణ వర్గాలకే ఎక్కువ ప్రాధాన్యం లభిస్తోందనే అభిప్రాయం కూడా కార్యకర్తలలో వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో సామాజిక సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని ఈసారి దళిత నాయకత్వానికి అవకాశం ఇవ్వాలనే చర్చ మండల కాంగ్రెస్ వర్గాల్లో సాగుతోంది.మండలంలో పార్టీ బలోపేతానికి దళిత నాయకులు కూడా గణనీయంగా కృషి చేస్తున్నారని, వారి సేవలను గుర్తించి మండల అధ్యక్ష పదవిలో వారికి అవకాశం కల్పించాలని కొందరు కార్యకర్తలు కోరుతున్నట్లు తెలుస్తోంది. దీంతో మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎవరికి దక్కనుందనే అంశంపై స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# తల్లిదండ్రులను గౌరవించాలి.. వృద్ధాశ్రమం ప్రారంభోత్సవంలో డా. చిన్నారెడ్డి పిలుపు



**పెబ్బేరు,మార్చి10(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణ కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్యన్ ఓల్డేజ్ హోం వృద్ధాశ్రమంను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన ఆశ్రమాన్ని సందర్శించి అక్కడి సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2 తదితర ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు పట్టాలు అందజేసే కార్యక్రమంలో తల్లిదండ్రులను గౌరవంగా చూసుకోవాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. తల్లిదండ్రులను సరిగా చూసుకోని పక్షంలో వారి జీతాల నుంచి 10 శాతం మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి పలుమార్లు పేర్కొన్నారని తెలిపారు.మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను గౌరవిస్తేనే భవిష్యత్తులో మన పిల్లలు కూడా మనలను గౌరవిస్తారని ఆయన అన్నారు.తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి పిల్లలను చదివించి, జీవితంలో స్థిరపడేలా చేస్తారని, అలాంటి తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో చేర్పించడం మహా పాపమని పేర్కొన్నారు.వృద్ధాశ్రమంలో నివసించే వృద్ధులకు మెరుగైన వైద్యసేవలు, మంచి భోజనం అందేలా చూడాలని ఆశ్రమ నిర్వాహకులు డి. శేఖర్‌కు సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు శేఖర్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. వృద్ధాశ్రమానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చిన్నారెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి నందిమల్ల యాదయ్య, మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి మండల్ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, పెబ్బేరు మండల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ నాయుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లారెడ్డి, కృపాకర్ రెడ్డి, ఎల్ల స్వామి, రాజు నాయక్, మోతిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులకు ఈనెల 12న శిక్షణ కార్యక్రమం

- 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించాలని
- సీఎస్ రామకృష్ణరావు ఆదేశాలు






**మేడ్చల్–మల్కాజిగిరి,మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12వ తేదీన సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మరియు 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని ఆయన జిల్లా కలెక్టర్లకు ఆదేశించారు.ఈ మేరకు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి శిక్షణా కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సమావేశంలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, మున్సిపల్ పరిపాలన కార్యదర్శి టి.కె. శ్రీదేవి, సెర్ప్ సీఈఓ దివ్య, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతాయని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ పథకాలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం వంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12,700 గ్రామ పంచాయతీలు, 110 మున్సిపల్ సంస్థలు ఉండగా దాదాపు 15 వేల మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను ఆహ్వానించాలని సూచించారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే ఫోటో ప్రదర్శనను వేదిక వద్ద ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఇప్పటి వరకు 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఫైళ్ల క్లియరెన్స్, పారిశుధ్య కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నందుకు జిల్లా కలెక్టర్లను అభినందించారు.కొత్తగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, మున్సిపల్ చైర్మన్లు, మేయర్లకు ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని కూడా సూచించారు.

# పిర్జాదిగూడలో గంజాయి పట్టివేత – ఒకరి అరెస్ట్

- 1.3 కిలోల గంజాయి స్వాధీనం – మరో వ్యక్తిపై కేసు నమోదు



**ఘట్కేసర్, మార్చ్ 10 (తెలంగాణ ముచ్చట్లు):** ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిర్జాదిగూడ-పర్వతాపూర్ రహదారిపై గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్టు చేశారు.వివరాల్లోకి వెళ్తే, ఎస్టీఎఫ్ 'ఏ' టీం లీడర్ అంజిరెడ్డి నేతృత్వంలోని బృందం మంగళవారం పర్వతాపూర్ రోడ్డులో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా కుమ్మరి గోపి అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, అతని వద్ద నుంచి సుమారు 1.3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు .ఈ ఘటనకు సంబంధించి మున్నా అనే మరో వ్యక్తిపై కూడా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితుడిని తదుపరి విచారణ కోసం ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్టీఎఫ్ టీం లీడర్ అంజిరెడ్డి వెల్లడించారు.గంజాయి విక్రయం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: పొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వేదన కాదు ఘర్జన



కుల కట్టుబాట్లతో ప్రేమని చంపారు
,ఇక చాలు,ప్రేమికుల రక్తం తడవని నేల కావాలి,
మత విద్వేషాలతో మమతని చంపారు
,ఇక చాలు,మనుషుల ఉనికిని కాపాడే చదువు కావాలి,
కార్మికుడి చెమటని దోచుకోవడమే రాజకీయపు కీర్తి అన్నారు,ఇక చాలు,అట్టడుగువాడి చేతిని పట్టిలేపే నాయకత్వపు స్ఫూర్తి కావాలి,
ఆడపిల్ల కప్పుకోవడమే దేశప్రకృతి అన్నారు,ఇక చాలు,స్వేచ్ఛని సమానంగా పంచుకునే ప్రగతి కావాలి.

పేగులు కాలినచోటే కడుపు నిండాలి,
కన్నీళ్ళు రాలినచోటే ఆశ మొలకెత్తాలి,
పుర్రె పగిలినచోటే పరిమళం వెదజల్లాలి ,
పారాణి పారినచోటే పద్మము వికసించాలి.
ఆఖరిగా,చివరాఖరిగా ధ్వంసమైనచోటే స్వేచ్ఛ ఉదయించాలి.
ఇది వేదన కాదు ఘర్జన.



–విజయ్ కర్నాటి

# కూల్చిన చోటే మళ్లీ 'అక్రమం'!

- జవహర్ నగర్ సర్వే నం.415లో తిరిగి నిర్మాణాలు
- యంత్రాంగం మౌనంపై స్థానికుల ఆగ్రహం

కాప్రా, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):







అక్రమ కట్టడాల విషయంలో అధికారులు అనుసరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది.మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ పరిధిలో గతంలో ఆక్రమణగా గుర్తించి కూల్చివేసిన స్థలంలోనే తిరిగి నిర్మాణాలు ప్రారంభం కావడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒకసారి అక్రమమని తేల్చిన స్థలంలో మళ్లీ పనులు సాగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అప్పట్లో హడావుడి... ఇప్పుడు నిశ్శబ్దం జవహర్ నగర్ సర్వే నంబర్ 415లో రహదారిని ఆక్రమించి భవనం నిర్మిస్తున్నారని గతంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు గతేడాది ఫిబ్రవరి 17న క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి అది ఆక్రమణేనని నిర్ధారించారు. అనంతరం పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో భవనాన్ని కూల్చివేశారు. ప్రభుత్వ భూములు, ప్రజా మార్గాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అప్పట్లో అధికారులు ప్రకటించారు.మళ్లీ మొదలైన నిర్మాణం కూల్చివేత జరిగిన నెల రోజులకే అదే ప్రదేశంలో మళ్లీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. పునాదులు వేసి గోడలు నిర్మిస్తున్నా మున్సిపల్, రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. సామాన్యులు చిన్నపాటి నిర్మాణం చేపట్టినా నిబంధనల పేరుతో ఆపే యంత్రాంగం, బహిరంగంగా రహదారిని ఆక్రమిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఈ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆక్రమణలను శాశ్వతంగా అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



జవహర్‌నగర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేత



# యువత డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ డి.ఎస్.పి పుష్పన్ కుమార్

ఎల్కతుర్తి, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):





హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ఎల్కతుర్తి పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. యువతను డ్రగ్స్ వ్యసనాల నుంచి దూరంగా ఉంచాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, యువతతో కలిసి ఎల్కతుర్తి మండల కేంద్రంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర డ్రగ్ కంట్రోలర్ డి.ఎస్.పి పుష్పన్ కుమార్, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ పుష్పక్ కుమార్ మాట్లాడుతూ యువత డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో మంచి అలవాట్లు పెంపొందేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. చెడు అలవాట్లు ఉన్న వారితో స్నేహం చేయకుండా విద్యార్థులు తమ భవిష్యత్తును మంచి దిశగా నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లల చదువు కోసం పడుతున్న కష్టాన్ని గుర్తించి వారికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు.

ప్రస్తుతం డ్రగ్స్ చాక్లెట్‌లు, సిగరెట్ల రూపంలో చలామణి అవుతున్నాయని తెలిపారు. మొదట ఉచితంగా ఇచ్చి యువతను వాటికి అలవాటు చేసి తర్వాత బానిసలుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. అందువల్ల విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలని, ఎవరు ఇలాంటి పదార్థాలు ఇచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసైతే అనారోగ్య సమస్యలతో పాటు కుటుంబాలు కూడా తీవ్ర ఇబ్బందులు పడతాయని, చివరకు జీవితాలు నాశనం అయ్యే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ నిర్మూలనలో సమాజం మొత్తం భాగస్వామ్యం కావాలని తెలిపారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి మంచి భవిష్యత్తు సాధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారి వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ చందు, మార్కెట్ కమిటీ చైర్మన్ సంతాజీ, ఎల్కతుర్తి మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి, సర్పంచ్ లావణ్య శేషగిరి, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, డాక్టర్ రమేష్, సెయింట్ థామస్ అల్టిట్యూడ్ పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతి, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





# బాలికలకు సైకిళ్ల పంపిణీ

- చదువులో ముందుండి అన్నిరంగాల్లో రాణించాలి
- కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):

బాలికలు చదువులో ముందుండి భవిష్యత్తులో అన్ని రంగాల్లో రాణించాలని, అందుకు అవసరమైన సహాయ సహకారాన్ని ప్రభుత్వం అందిస్తుందని జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బాలికలకు ఉచితంగా 100 సైకిళ్లు అందించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ వంద శాతం హాజరు ఉన్న బాలికలకు సైకిళ్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరి 21 మంది విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, విద్యార్థినులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థినిలకు వాటర్ బాటిల్స్ అందజేసిన బిఆర్ఎస్వీ నాయకుడు

స్టేషన్ ఘనపూర్, మార్చి10(తెలంగాణ ముచ్చట్లు):





స్టేషన్ ఘనపూర్ మునిసిపాలిటీ పరిధిలోని శివునిపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థినీలకు భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం బిఆర్ఎస్వి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి ఆధ్వర్యంలో 50 వాటర్ బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను సాధించడానికి పదవ తరగతి పరీక్షలు బలమైన పునాది వంటివని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని సాధించేందుకు నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందన్నారు. పేదరికాన్ని అధిగమించి జీవితంలో ఎదగడానికి విద్యే ప్రధాన మార్గమని, చదువును నిర్లక్ష్యం చేయకుండా దానిపై దృష్టి సారించాలని సూచించారు. మెరుగైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత ముఖ్యమని అన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థినీలు వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాలో ముందంజలో నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా శ్రీనివాస్, భూక్యా సురేష్, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి. సురేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు జ్యోతి, పార్వతి బాయ్, శ్రీమతి, సుమలత, చంద్రం, మల్లు, మాన్య, సుజాత, కల్పన, అనితతో పాటు విద్యార్థినీలు పాల్గొన్నారు.

# బ్రతకడమే యుద్ధం

EMIలు లేని సంవత్సరం ఒకటి కావాలి
ఏమాయ లేని మనసులున్న మనుషుల ప్రాంతం ఒకటి కావాలి

తేదీలు లెక్కపెట్టుకుంటూ
జీతం కోసమే జీవితమే అనేలా బ్రతుకుతున్న
బ్రతుకుకు ఒక ముగింపు కావాలి..

మేము బాధ్యతలకు భయపడినంత
చావుకు కూడా భయపడం
బంధాలు అనుబంధాలు అనే ముళ్ళు లేకపోతే
ఎప్పుడో మా మెడల్ని ఉరితాళ్లు ముద్దాడేవి
చావు ప్రేమగా మా గుండె తలుపులు తట్టి
నూతన సంవత్సర వేడుకలకు పిలిచేది

ఏ యుద్ధం అనివార్యం కాదు మాకు
లేస్తే మొదలు...
పడుకునే వరకు...
కలలు గురించి ఆలోచించడం
బాధ్యతలు ఎత్తుకున్నాకే
మానేశాం కదా
ఇప్పుడున్నదల్ల ఒకే కల అది నెరవేరేది నిద్దురలోనే
లేకపోతే పగటి పొద్దులో

బ్రతకడమే యుద్ధం గా భావిస్తున్న మాకు
అలా ఇలా ఎలాగోలా.. బ్రతికితే చాలు
బాధ్యతగా బ్రతికితే చాలు
ఏ సంవత్సరం వచ్చి వెక్కిరించినా....
అలిగి కూర్చోలేం కదా...

కడుపు నిండాలి అంటే కష్టం చేయాల్సిందే
జేబు చూసి వచ్చేవాళ్ళ కోసం కాకపోయినా
మనకొచ్చే జబ్బుకోసం లేదంటే వచ్చిన జబ్బుకు
అయిన అప్పుల కోసమయినా బ్రతకాలి

ఒక్కోసారి సమయం కూడా మమ్మల్ని చూసి
జాలిపడుతుంది .. మా కోసం కూడా కాసింత
సమయం దాచుకోమని కానీ సమయానికి కూడా తెలుసు మేమెప్పుడో నిలువెల్లా దోచుకో బడ్డామని

ఎవరికి ఈ సంవత్సరం
ఎందుకు ఈ సంవత్సరం
మాకు ఓ సంవత్సరం కావాలి
తేదీలు లెక్కపెట్టకుండా
రోజులు గడవకుండా
క్యాలెండర్ అవసరం లేకుండా
కలలతో పనిలేకుండా
కరెన్సీ కనబడకుండా
మా దేహాన్ని ఈ మట్టి ముద్దాడే రోజుకటి రావాలి
అది మా సంవత్సరం అని మేము ప్రేమగా
గుండెలకు హత్తుకోవాలి



- లక్ష్మీపుత్ర పృథ్వీనాథ్ చారి
6302571472





# సింగరేణి సత్తుపల్లిలో మహిళా దినోత్సవ వేడుకలు

- పీవీఎస్ఆర్ సెంటెనరీ కాలనీలో నిర్వహణ.
- ఎమ్మెల్యే మట్టా రాగమయి హాజరు.
- మహిళలకు పోటీలు, బహుమతులు.

సత్తుపల్లి, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):

సింగరేణి సత్తుపల్లి ఏరియాకు చెందిన పీవీఎస్ఆర్ సెంటెనరీ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ ఆధ్వర్యంలో, ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి చింతల లక్ష్మీ శ్రీనివాస్ మరియు సేవా సభ్యుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమైయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్లూరు ఏసీపీ వసుందర యాదవ్, ఐపీఎస్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్, ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి చింతల లక్ష్మీ శ్రీనివాస్ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.డి. రెహనా బేగం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుల రాజేశ్వరి, 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి తదితరులను సన్మానించారు. అధికారులు, ఉద్యోగుల గృహిణుల కోసం నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సేవా సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.డి. రెహనా బేగం, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బొంతు సుమలత, కిష్టారం గ్రామ సర్పంచ్ నరుకుళ్ళ రాజేశ్వరి, 13వ వార్డు కౌన్సిలర్ ఉప్పు నాగమణి, బి. నవ్య కోటేశ్వరరావు (ఐఎన్‌టీయూసీ), శ్రీవాణి సూర్యప్రకాష్ (ఏఐటీయూసీ)తో పాటు సేవా సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహణ
- మహిళా విద్యకు ఆమె చేసిన సేవలను స్మరించుకున్న నాయకులు

**కాప్రా, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కాప్రా మండలంలోని రాధికా ప్రాంతంలో ఎస్ఎఫ్ఐ కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో భారతదేశపు తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి కార్యక్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సుమారు 100 మంది విద్యార్థినులు మరియు సభ్యులు పాల్గొన్నారు.కార్య క్రమానికి కాప్రా మండల అధ్యక్షుడు శ్యామ్ రావు అధ్యక్షత వహించగా, మండల కార్యదర్శి శ్రీమన్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మెడ్చల్ జిల్లా కార్యదర్శి కార్తిక్ ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్ర సంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి పూలే చేసిన సేవలను వివరించారు. కుల వివక్ష, సామాజిక అన్యాయాలను ఎదుర్కొంటూ కూడా బాలికల విద్య కోసం ఆమె ధైర్యంగా పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. విద్యార్థులు ఆమె ఆశయాలను ఆద ర్శంగా తీసుకుని సమానత్వం, విద్య హక్కుల కోసం కృషి చేయాలని పిలు పునిచ్చారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు అతిథులు, విద్యార్థులు మరియు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృత జ్ఞతలు తెలిపారు.

# 'పొంగులేటి' చెప్పారంటే.. చేసినట్లే!

- భూదాన్ నిర్వాసితుల కన్నీరు తుడిచేందుకు సిద్ధమైన మంత్రులు.. రేపే పట్టాల పంపిణీ
- ఇచ్చిన గడువు కంటే నాలుగు రోజుల ముందే 'వెలుగుమట్ల' బాధితులకు విముక్తి

**ఖమ్మం బ్యూరో, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):** "మార్చి 15లోపు మీకు పట్టాలిస్తాం.. అండగా ఉంటాం" అని వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇచ్చిన హామీ అక్షర సత్యం కాబోతోంది. మాట ఇస్తే మడమ తిప్పని నేతగా పేరున్న ఆయన, తాను విధించుకున్న గడువు కంటే నాలుగు రోజుల ముందే బాధితుల కష్టా లను తీర్చేందుకు సిద్ధమయ్యారు. రేపు (బుధవారం) సాయంత్రం 4 గంటలకు ఖమ్మం ఐడీఓసీ వేదికగా భూదాన్ నిర్వా సితుల కళ్లలో ఆనందాన్ని నింపేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

**మాట ఇచ్చారు.. ముందే నెరవేరుస్తున్నారు**

దళారుల ఉచ్చులో చిక్కి, గూడు కోల్పోయి, చీకట్లో మగ్గుతున్న వెలుగుమట్ల బాధితుల సమస్యను మంత్రి పొంగులేటి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఇటీవల జరిగిన ముఖాముఖిలో వారి గోడును విని చలించిపోయిన ఆయన, వెనువెంటనే అధికారులను రంగంలోకి దింపారు. రాజ కీయాలకు తావులేకుండా, అత్యంత పారద ర్శకమైన సర్వేను పూర్తి చేయించి, నిజమైన నిరుపేదలను గుర్తించారు. బుధవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి లబ్ధిదా రులకు స్వయంగా మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

**ఒకే వేదికపై రెట్టింపు ప్రయోజనం**

మంత్రి పొంగులేటి ప్రత్యేక చొరవతో బాధితులకు కేవలం స్థలమే కాకుండా, ఇల్లు కట్టుకునేందుకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం కూడా మంజూరైంది. ఈ ప్రక్రియలో భాగంగా 311 మందికి ఇంటి స్థలం లేని వారికి 'పట్టా'తో పాటు 'ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం' ఇస్తారు. 101 మందికి ఇప్పటికే స్థలం ఉన్న వారికి నేరుగా 'ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం' అందజేస్తారు. మొత్తంగా 412 కుటుంబాలకు రేపటితో శాశ్వత గృహ యోగం కలగబోతోంది.

**దళారీ వ్యవస్థకు చెక్.. పేదలకు అండ**

పేదల రక్తం తాగే దళారీ వ్యవస్థపై మంత్రి పొంగులేటి ఉక్కుపాదం మోపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, లంచాలకు తావులేకుండా నేరుగా మంత్రులే బాధితుల చేతికి పట్టాలు ఇస్తుండటం జిల్లా చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది. ఇచ్చిన మాట కంటే ముందే బాధితుల కు న్యాయం చేస్తుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 40 ఆరోగ్య మిత్ర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

- మార్చి 11 నుంచి 16 వరకు దరఖాస్తుల స్వీకరణ
- డీఎంహెచ్ఓ డా. ఉమా గౌరి

**మేడ్చల్ – మల్కాజిగిరి, మార్చి 10 ( తెలంగాణ ముచ్చట్లు):** జిల్లాలో ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ఫీల్డ్ ఆపరేషన్స్‌లో ఖాళీగా ఉన్న ఆరోగ్య మిత్ర పోస్టులను భర్తీ చేయడానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వా నిస్తున్నట్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను హైదరాబాద్‌లోని తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (టిమ్స్), సనత్‌నగర్‌లో విధులు నిర్వ హించేందుకు నియమించనున్నట్లు పేర్కొ న్నారు.మొత్తం 40 ఆరోగ్య మిత్ర పోస్టుల ను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయను న్నట్లు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు గ్రాడ్యుయేషన్‌తో పాటు డీసీఏ అర్హత కలిగి ఉండాలి. అలాగే కనీసం రెండు సంవత్సరాల అనుభవం ఉండాలని వెల్లడించారు. మేడ్చల్ -మల్కా జిగిరి జిల్లా స్థానిక అభ్యర్థులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని స్పష్టం చేశారు.అర్హత గల అభ్యర్థులు మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా అధికారిక వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి సమర్పించాలి. దరఖాస్తులను మార్చి 11, 12, 13 మరియు 16 తేదీలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు.పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి కార్యాలయం (డిఎం& హెచ్ఓ కార్యాలయం), ఎఫ్1, ఐడిఓసి, అంతాయిపల్లి, మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, అనుభవ సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులు మరియు రూ.500 డిమాండ్ డ్రాఫ్ట్‌ను జిల్లా వైద్య & ఆరోగ్య అధికారి, మేడ్చల్‌మల్కాజ్గిరి జిల్లా" పేరిట జతచేయాలని తెలిపారు. అర్హత గల స్థానిక అభ్యర్థులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని డా. ఉమా గౌరి సూచించారు.

# క్వెస్ట్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబర్చిన కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

**ఖాజీపేట,మార్చి10(తెలంగాణ ముచ్చట్లు):**







కాజిపేట్ మండలంలోని డీజిల్ కాలనీలో ఉన్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థు లు క్విస్ట్ కౌన్సిల్ వర్చెస్-2026 పోటీలో ప్రతిభ చాటారు. నిర్వహించిన కాంపిటేటివ్ పరీక్షలో ఐదవ తరగతి విద్యార్థి నీలేష్ రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. అదే పరీక్షలో అరుణ్ విశాల్, మాన్విత్, భవిష్య, వర్షిత్, ఫాతిమా బేగం, సదృశ్య, మోక్ష, తియాంషి, పూజశ్రీ, భవాని సింగ్, నేతన్, పున్నం చందర్, మాన్విత్, మను వరుణ్, శశి ప్రియ, నిరోషిని, ప్రణీత్, గాయత్రీ దేవి తదితర విద్యార్థులు కూడా ప్రతిభ కనబరిచారు.ఈ సందర్భంగా హైదరాబాదులోని రవీంద్రభా రతిలో అమృత విశ్వ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన క్విస్ట్ కౌన్సిల్ వర్చెస్ వేడుకల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గ్రాండ్ ఛాం పియన్స్‌గా ప్రకటించి సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు. విద్యా నైపుణ్యాలను ప్రోత్స హించే కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వి ద్యార్థులను ప్రముఖుల సమక్షంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కృష్ణవేణి టాలెంట్ స్కూల్ చైర్మన్ వట్నాల శ్రీనివాస్, డీన్ కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ విద్యార్థు లు సాధించిన విజయానికి కాజిపేట్ శాఖ ప్రధానోపాధ్యాయురాలు నుజహత్, ఉప ప్ర ధానోపాధ్యాయుడు విజయ్, ఉపాధ్యాయుల కృషి కీలకమైందని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో కూడా విద్యా రంగంలో మరింత అభివృద్ధి సాధించేందుకు నిరంతరం మార్గద ర్శకత్వం అందించాలని సూచించారు.

# మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రకటన కోసం మార్చి 14న సమావేశం

**హైదరాబాద్,మార్చి10(తెలంగాణ ముచ్చట్లు):**



హిమాయత్‌నగర్‌లోని మేల్కోటే పార్క్‌లో మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రక టన కోసం సన్నాహక సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమా వేశంలో మార్చి 14న మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

ఈ సందర్భంగా డాక్టర్ పిడమర్తి రవి మా ట్లాడుతూ మహనీయుల జయంతి ఉత్సవ కమిటీ ప్రకటన కోసం మార్చి 14న మధ్యా హ్నం 12 గంటలకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో దళిత, బహుజన, గిరిజన సంఘాల ఆధ్వ ర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తు న్నట్లు తెలిపారు. సమాజంలో మహనీయుల ఆశయాలను విస్తృతంగా చాటిచెప్పేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నా రు.ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమ కారుల సంఘం రాష్ట్ర సమన్వయకర్త గాదె వెంకట్, డాక్టర్ బొమ్మెర స్టాలిన్, మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఒక్కలగ డ్డ చంద్రశేఖర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, తాళ్ల సునీల్, తాళ్ల అజయ్, మాదిగ యూత్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క మహేష్, విద్యార్థి జేఏసీ అధ్యక్షుడు జోగు గణేష్, చాగంటి శేఖర్, చనుంపల్లి కిరణ్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసిన ఎంపీ డా. కడియం కావ్య

**వరంగల్,మార్చి10(తెలంగాణ ముచ్చట్లు):**

న్యూఢిల్లీలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా పార్టీ సీనియర్ నాయ కురాలు ఎర్రబెల్లి స్వర్ణను అధిష్ఠానం నియ మించిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది.

ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్యతో కలిసి ఎర్రబెల్లి స్వర్ణ మల్లికార్జున ఖర్గేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి తగిన విధంగా మహిళా కాంగ్రెస్‌ను బలోపేతం చేయడా నికి కృషి చేస్తానని ఎర్రబెల్లి స్వర్ణ పేర్కొ న్నారు. తెలంగాణలో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని మరింత పెంచుతూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, మహిళా కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించారు.





# నీళ్ల కోసం రోడ్డు ఎక్కిన మహిళలు

- హసన్ పర్తి కార్పొరేషన్ ఆఫీసు ముందు బై టయింపు.

**హసన్ పర్తి,మార్చ్ 10( తెలంగాణ ము-చ్చట్లు):** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66వ డివిజన్ హసన్ పర్తి మండల కేంద్రంలోని రాంనగర్ కు చెందిన మహిళలు త్రాగు నీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళ వారం రోజున ఖాళీ బిందెలతో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఎండాకాలం ఆరంభంలోనే త్రాగునీటి సమస్య తీవ్ర తరం కావడంతో సమస్య పరిష్కరించాలని ఆ ప్రాంతానికి చెందిన మహిళలు ఖాళీ బిందెలతో స్థానిక మున్సిప ల్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. కాలనీలో దాదాపు లక్ష జనాభా ఉంటుందని వేసవి కాలం ఆరంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే మునుముందు తాగునీటి సమస్య తీవ్రత రం అవుతుందని సంబంధిత అధికారులు ,రాజకీయ నాయకులు స్పందించి సమస్య తీవ్రతరం కాకముందే పరిష్కరించాలని కోరారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై దేవేందర్ ఘటనా స్థలానికి చేరుకొని సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసు కువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# ఉప్పల్–కీసరలో వరుస చోరీలు ముగ్గురు అరెస్ట్


**కీసర, మార్చి 10 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలోని కీసర సర్కిల్ పరిధిలో ఇళ్లలో వరుసగా జరుగుతు న్న చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. ఈ కేసుల్లో ప్రమేయం ఉన్న ముగ్గురు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు.చా ర్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ బృందం, కీసర పోలీసులతో కలిసి నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో నిందితులు అమర్ రాజ్ కుమార్ రెడ్డి, అబ్దుల్ లతీఫ్ ఖాన్, గులాం హుస్సేన్ ఖాన్‌లను అదుపులోకి తీసుకున్నా రు.పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముగ్గురు ముఠాగా ఏర్పడి ఉప్పల్, కీసర ప్రాంతాల్లో ఇళ్లను లక్ష్యంగా చేసుకుని పలు చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. వి శ్వసనీయ సమాచారం మేరకు నిందితులను పట్టుకుని విచారించగా, అనేక చోరీ కేసుల్లో వారి ప్రమేయం బయటపడింది.నిందితుల వద్ద నుంచి సుమారు రూ.13 లక్షల విలువైన 65 గ్రాముల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి ఆభరణాలు, మూడు మోటార్ సైకిళ్లు, ఏడు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తు న్నట్లు పోలీసులు తెలిపారు.




# ఆమె నడిచే దారిలో..!


ఆమె నడిచే దారిలో ముళ్ళు లేవు. కానీ,
కళ్ళు నాటిన భయాలే ఉన్నాయి. ఆమె నిశ్శబ్దాన్ని-
గుణం,సహనం,ఓర్పు అన్నారు కానీ,
అది ఎన్నో అరుపుల సమాధి. ఆమె మౌనంగా
ఉన్నప్పుడు ఓటమి అనుకున్నారు.
ఆ మౌనంలో ఎన్ని తిరుగుబాట్లు ఊపిరాడక
చచ్చాయో ఎవరు లెక్కించలేదు.
ఆమె స్వప్నాలకు తాళాలు వేసి, సమాజం తానే
సంస్కారం అని పిలుచుకుంటుంది.
ఆమెను బలహీనమని పిలవడం సమాజం
చెప్పకున్నా అతిపెద్ద అబద్ధం.
ఆమె నడిచే ప్రతి అడుగు అనుమతుల మధ్య
సాగుతుంది. ఎక్కడ నవ్వాలి-
ఎప్పుడు మాట్లాడాలి- ఎంతవరకు కదలాలి- ఇలా
అన్ని ఆమెకు ముందే రాసిన నిబంధనలు..
చీకటి ఆమెకు శత్రువు కాదు, ఆమె చుట్టూ తిరిగే
చూపులే శత్రువులు.
విచారణ చేసే కళ్ళే ఆమెకు ప్రమాదం.
చదువు అడిగితే పరువు అడ్డుపెట్టారు.
స్వప్నాలు చెపితే సరిహద్దులు గీశారు.
ఆమె తన రెక్కలను ఎంతవరకు విప్పాలో
సమాజమే నిర్ణయించింది.
ఆమె శరీరంపై తీర్పులు చెప్పే నోర్లు ఆమె
ఆలోచనల దగ్గర నిశ్శబ్దంగా వణుకుతాయి.
ఎందుకంటే ఆలోచించే స్త్రీ అత్యంత
ప్రమాదకరమైన స్వేచ్ఛ కాబట్టి.
ఆమె ఒంటరి కాదు,
ఆమె వెనకాల తరాల మౌనం దాగుంది.
నొక్కిన గొంతులు,నలిపిన స్వప్నాలు ఉన్నాయి.
ఆమె ఈ సమాజానికి ఆధారమైనప్పటికీ,
అధికారికంగా ఎప్పుడూ గుర్తించబడలేదు.
ఆమె శ్రమ గడియారంలో లెక్క పడలేదు కానీ,
ప్రతిరోజు జీవితాన్ని నడిపిస్తుంది..



–స్వప్న కొండమడుగు

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


అప్పటి కార్మిక శాఖ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయాతో...నల్ల స్వామి


కార్మిక శాఖా మంత్రి వివేక్ వెంకటస్వామితో నల్ల స్వామీ

## కార్మికుల హక్కుల కోసం

# అలుపెరుగని పోరాటం

**భవన నిర్మాణ రంగ కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తూ, కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ముందుండే నాయకుల్లో నల్ల స్వామి ఒకరు. కార్మికుల సంక్షేమం కోసం నిర్వహించిన అనేక ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ కార్మిక సంఘాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా పనిచేస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, సంక్షేమ పథకాలు, సంఘం పోరాటాల గురించి ఆయనతో జరిపిన సంభాషణ ఇలా ఉంది.** - తెలంగాణ ముచ్చట్లు, హన్మకొండ

**ప్రశ్న: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం చట్టం ఎప్పుడు అమలులోకి వచ్చింది?**

**జవాబు:** భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం 1996లో పార్లమెంటులో ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. ఆ సమయంలో దేశ ప్రధానిగా దేవెగౌడ ఉన్నారు. కార్మిక వర్గ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ఆ చట్టాన్ని ప్రవేశపెట్టారు. అయితే చట్టం వచ్చిన తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రంలో కొన్ని సంవత్సరాల పాటు ప్రభుత్వాలు దాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేశాయి. దీంతో కార్మిక సంఘాలు పోరాటాలు ప్రారంభించాయి. "పునాదుల గర్జన" నినాదంతో రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులను సమీకరించి హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఆ ఉద్యమాల ప్రభావంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి స్పందించి 1996 చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేశారు. ఆ తర్వాత సభ్యత్వ విధానం ద్వారా కార్మికుల నుంచి 62 రూపాయలు తీసుకుని ఉమ్మడి రాష్ట్రంలో సుమారు 45 లక్షల మంది కార్మికులను ప్రభుత్వం గుర్తించింది.

**ప్రశ్న: కార్మికుల కోసం ఎన్ని పథకాలు అమలు చేశారు?**

**జవాబు:** 2009లో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేశారు. ఆ బోర్డుకు చైర్మన్‌ను నియమించారు. నిర్మాణంలో ఉన్న భవనాలపై ఒక శాతం సెస్ వసూలు చేసి బోర్డు నిధిగా జమ చేయడం ప్రారంభమైంది. ఆ సమయంలో సాధారణ మరణానికి 30 వేల రూపాయలు, ప్రమాదంలో మరణించిన వారికి 2 లక్షల రూపాయలు, ప్రసూతి అయిన మహిళా కార్మికులకు 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేవారు.

**ప్రశ్న: కార్మికుల సమస్యలు ఇంకా ఏమేమి ఉన్నాయి?**

**జవాబు:** భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న చాలా మంది కార్మికులు ఇంకా సంక్షేమ బోర్డు సభ్యత్వం పొందలేదు. పని స్థలాల్లో భద్రతా చర్యలు సరైన విధంగా అమలు కావడం లేదు. ప్రమాదాలు జరిగే సందర్భాల్లో కూడా చాలా కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అందుకే ప్రతి కార్మికుడు తప్పనిసరిగా సంక్షేమ బోర్డులో నమోదు కావాలని, అలాగే ప్రభుత్వం కూడా భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయాలని మేము కోరుతున్నాం.


కార్మిక సంఘం నాయకులతో...

**ప్రశ్న: ప్రస్తుతం ప్రభుత్వం ఎంత మేరకు సహాయం అందిస్తోంది?**

**జవాబు:** కార్మిక సంఘాలు నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలు వంటి పోరాటాల వల్ల సంక్షేమ పథకాలలో మార్పులు జరిగాయి. ప్రస్తుతం సాధారణ మరణానికి 2 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే 10 లక్షలు, అంగవైకల్యం కలిగితే 6 లక్షలు, ప్రసూతి కానుకగా 30 వేల రూపాయలు, పెళ్లి కానుకగా 30 వేల రూపాయలు అందిస్తున్నారు.

**ప్రశ్న: భవిష్యత్తులో కార్మిక సంఘం లక్ష్యం ఏమిటి?**

**జవాబు:** రాష్ట్రంలో ఉన్న ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి సంక్షేమ పథకాల ప్రయోజనం చేరేలా చేయడం మా ప్రధాన లక్ష్యం. కార్మికులకు ఆరోగ్య బీమా, పిల్లల విద్యకు సహాయం, వృద్ధాప్యంలో పింఛన్ వంటి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. కార్మికుల హక్కుల కోసం భవిష్యత్తులో కూడా సంఘం పోరాటాన్ని కొనసాగిస్తుంది.


**- నల్ల స్వామీ**
తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి

**ప్రశ్న: మీరు ఈ కార్మిక ఉద్యమంలో ఎప్పటి నుంచి పని చేస్తున్నారు?**

**జవాబు:** నేను 2003లో గ్రామ శాఖ అధ్యక్షుడిగా కార్మిక ఉద్యమంలో పని ప్రారంభించాను. 2006లో ధర్మసాగర్ మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాను. 2009లో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యాను. 2016లో ఖమ్మం జిల్లా ఇంచార్జిగా పని చేశాను. అనంతరం 2022లో రాష్ట్ర కమిటీలో రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి ప్రస్తుతం ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నాను.



## అక్కడ నయనతార టాప్..

సినీ పరిశ్రమలో ప్రతి సంవత్సరం ఎన్నో కొత్త హీరోయిన్లు పరిచయమవుతున్నప్పటికీ లేడీ సూపర్ స్టార్ నయనతార స్థానం మాత్రం ఇంకా ఎవరూ అందుకోలేని స్థాయిలోనే ఉంది. తోటి హీరోయిన్లు కొంతవరకు రేసులో వెనుకబడుతున్నప్పటికీ నయనతార క్రేజ్ మాత్రం తగ్గకుండా మరింత పెరుగుతూనే ఉంది. చేతినిండా సినిమాలతో ఆమె ప్రస్తుతం దక్షిణ భారత సినీ రంగంలో అత్యంత బిజీగా ఉన్న నటీమణుల్లో ఒకరిగా కొనసాగుతోంది.

ఇండస్ట్రీలోకి ఆమెతో పాటు వచ్చిన సమంత, తమన్నా, కాజల్ అగర్వాల్, అనుష్క శెట్టి వంటి ప్రముఖ నటీమణులు కొంతమేరకు సినిమాల సంఖ్య తగ్గించినా, నయనతార మాత్రం నిరంతరం కొత్త ప్రాజెక్టులతో ముందుకు సాగుతోంది. ఇటీవల విడుదలైన "మన శంకర వర ప్రసాద్ గారు" చిత్రంలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఆమె, త్వరలో విడుదల కానున్న భారీ పాన్ ఇండియా చిత్రం "టాక్సిక్"లో కూడా కీలక పాత్రలో కనిపించనుంది.

ఇక నటనతో పాటు లేడీ ఓరియెంటెడ్ చిత్రాలపై కూడా నయనతార ప్రత్యేక దృష్టి పెట్టుతోంది. ప్రస్తుతం "మూకుతి అమ్మన్ 2", "రెక్కయి" వంటి కథానాయిక ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో కూడా ఆమె నటిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలు కూడా ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇక మరోవైపు నందమూరి బాలకృష్ణ కొత్త చిత్రం "ఎన్‌బీకే 111"లో కూడా నయనతార కథానాయికగా ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. గతంలో బాలకృష్ణతో కలిసి "సింహా", "జై సింహా", "శ్రీ రామరాజ్యం" వంటి చిత్రాల్లో నటించిన నయనతార, ఇప్పుడు మరోసారి ఆయనతో జోడీ కట్టే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్న నయనతార ఒక్కో చిత్రానికి దాదాపు పది కోట్ల రూపాయల వరకు పారితోషికం తీసుకుంటున్నట్లు సమాచారం. దక్షిణ భారత సినీ రంగంలో ఇంత భారీ పారితోషికం తీసుకుంటున్న నటీమణుల్లో ఆమె ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ప్రస్తుతం దక్షిణ భారత సినీ పరిశ్రమలో నయనతారను మించే స్థాయిలో పోటీ ఇవ్వగల కథానాయిక ఇప్పట్లో కనిపించడం లేదని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## పిల్లలను కూడా దగ్గరకు తీసుకోవడం లేదు.. అలేఖ్య రెడ్డి భావోద్వేగం

నందమూరి కుటుంబానికి చెందిన నటుడు నందమూరి తారకరత్న 2023 ఫిబ్రవరిలో మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణం తర్వాత భార్య అలేఖ్య రెడ్డి ఎక్కువగా బయటకు రాకుండా తన పిల్లలతోనే సమయం గడుపుతూ వస్తోంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో తారకరత్న జ్ఞాపకాలను, పిల్లల గురించి పోస్టులు చేస్తూ అభిమానులతో పంచుకుంటోంది. అయితే తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న అలేఖ్య తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు విషయాలను వెల్లడించింది.

ఈ సందర్భంగా తారకరత్నతో తన పరిచయం ఎలా మొదలైందో ఆమె వివరించింది. హైదరాబాద్‌లోనే మొదటిసారి తారకరత్నను కలిసినట్లు చెప్పింది. మొదట ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారని, తర్వాత ఆ స్నేహం ప్రేమగా మారిందని తెలిపింది. అప్పటికే తాను మొదటి వివాహం నుంచి విడాకులు తీసుకున్నానని, ఇక మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనుకోలేదని చెప్పింది. అయితే తారకరత్న తనను నమ్మబలికి పెళ్లికి ఒప్పించాడని వెల్లడించింది. తన తండ్రికి తారకరత్న ముందే పరిచయం ఉందని, అందుకే తానే వెళ్లి తన తల్లిదండ్రులతో మాట్లాడాలని కోరానని అలేఖ్య తెలిపింది. మొదట్లో వారు అంగీకరించకపోయినా కొంతకాలానికి ఒప్పుకున్నారని చెప్పింది. అయితే తమ పెళ్లికి తారకరత్న కుటుంబం నుంచి మాత్రం అంగీకారం రాకపోవడం బాధగా ఉందని ఆమె పేర్కొంది. అయినప్పటికీ తాను మాత్రం తారకరత్న తల్లిదండ్రులను ఎప్పుడూ మామయ్య, అత్తయ్యలుగానే భావించానని తెలిపింది. అయితే ఇప్పటికీ వారు తనను పూర్తిగా అంగీకరించలేదని, పెద్దవాళ్లు కావడంతో తమపై కోపం ఉండొచ్చని ఆమె చెప్పింది. ఒకరోజు అయినా పిల్లలను దగ్గరకు తీసుకుంటారని ఆశిస్తున్నానని భావోద్వేగంగా పేర్కొంది. ఇప్పటివరకు చాలాసార్లు దగ్గరవ్వడానికి ప్రయత్నించానని, కానీ ప్రస్తుతం తారకరత్న కుటుంబ సభ్యులతో తనకు ఎలాంటి సంబంధం లేదని తెలిపింది. ఇక ఒకప్పుడు నందమూరి కళ్యాణ్ రామ్ స్నేహితుడిలా ఉండేవాడని కూడా చెప్పింది. అయితే తమ గురించి తెలుసుకుంటూ ఉండే వ్యక్తి మాత్రం నందమూరి బాలకృష్ణ మాత్రమేనని వెల్లడించింది. తన దగ్గర ఉన్న దాంట్లోనే పిల్లలను పెంచగలనని, కానీ తారకరత్న తల్లిదండ్రులు కూడా మనవళ్లను దగ్గరకు తీసుకుంటే ఎంతో ఆనందంగా ఉంటుందని చెప్పింది. "పిల్లలను ఒక్కసారి అయినా దగ్గరకు తీసుకుంటే చాలు... అదే నా కోరిక" అంటూ ఆమె భావోద్వేగానికి లోనైంది. ప్రస్తుతం ఆమె చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తారకరత్న అభిమానులు ఆమెకు ధైర్యం చెబుతూ స్పందిస్తున్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in